ప్రజాశక్తి
బుధవారం 11 జూన్ 2025

రక్తదాన శిబిరాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో పలు శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపుమేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి గౌరీశంకర్ పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన స్థానిక కాఫీ హౌస్ లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు, డాక్టర్ షేక్ ఎండి షరీఫ్ అధ్యక్షతన ఆ శాఖ సమన్వయంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తు న్నారన్నారు. 13న పాడేరు మెడికల్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు. 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, ఔత్సాహికులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం

జిల్లాలో 2,913 పాఠశాలల్లో సరఫరాకు ఏర్పాట్లు ▸▸ 1,69,175 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు: 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో అల్లూరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు నోట్స్ పుస్తకాలను సరఫరా చేసేందుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాలోని పాడేరు, రంపచోడవరం డివిజన్లో ఉన్న 22 మండలాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. అల్లూరి జిల్లాలోని వివిధ యాజమాన్యాల కింద నిర్వహించబడుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 2,551 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 91 ఉన్నత పాఠశాలలు 271 ఉన్నాయి. వీటిలో ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యాభ్యాసం చేయనున్న విద్యార్థిని విద్యార్థులు 1 లక్ష,69 వేల 175 మంది ఉన్నారు. ఇందులో 82,757 మంది బాలురు 86,418 మంది

ప్రతి విద్యార్థికీ మిత్ర కిట్లు

పాఠశాలలోని ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తున్నాం. ఒక కిట్ లో మూడు జతల యూనిఫామ్‌కు క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్స్‌లు, ఒక బెల్ట్ స్కూల్ బ్యాగ్ అందజేస్తున్నాం. స్కూల్ బ్యాగ్‌లు స్మాల్, మీడియం, లార్జ్, మూడు రకాల్లో సరఫరా జరిగాయి, ప్రైమరీ స్కూల్ పిల్లలకు స్మాల్ బ్యాగులు యూపీ స్కూల్ విద్యార్థులకు, మీడియం బ్యాగులు హైస్కూల్ విద్యార్థులకు పెద్ద బ్యాగులను పంపిణీ చేయనున్నాం.

విఎం స్వామినాయుడు
ప్రాజెక్ట్ అధికారి
సర్వ శిక్ష అభియాన్
అల్లూరి జిల్లా

మండల కేంద్రాల్లో స్టాక్ పాయింట్లు

జిల్లాలోని 22 మండలాల్లో పాఠ్యపుస్తకాలు నోట్స్ పుస్తకాలు విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ కోసం అన్ని మండల కేంద్రాల్లో ఒక పాఠశాలను ఎంపిక చేసి స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశాం. మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో ఆయా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ పుస్తకాలు అందచేసేందుకు ఏర్పాట్లు చేసాం. సకాలంలో పుస్తకాలు పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

బ్రహ్మాజీ రావు
అల్లూరి
జిల్లా విద్యాశాఖ అధికారి

స్టాక్ పాయింట్ వద్ద హెచ్‌ఎం లకు పుస్తకాలు ఇస్తున్న సిబ్బంది

బాలికలు ఉన్నారు. 6వ తరగతి నుంచి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని తరగతుల విద్యార్థులకు నోట్స్ పుస్తకాలను సరఫరా చేస్తున్నారు.
ఈ మేరకు 6,7 తరగతుల విద్యార్థిని విద్యార్థులకు 8 చొప్పున నోట్స్ పుస్తకాలు, ఎనిమిదవ తరగతి విద్యార్థులకు 10, 9 తరగతి విద్యార్థిని విద్యార్థులకు 12, 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 14 చొప్పున నోట్స్ పుస్తకాలు సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.
1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు నోట్స్ పుస్తకాలకు బదులుగా వర్క్ బుక్స్ పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది ఒకటవ తరగతిలో చేరే పిక్టోరియల్ డిక్షనరీ (బొమ్మల పుస్తకం) 6వ తరగతికి వచ్చే విద్యార్థిని విద్యార్థులకు 11 వేల 075 ఆక్స్ఫర్డ్ డిక్షనరీలు పంపిణీ చేయనున్నారు.

ఆకట్టుకుంటున్న ఇనుప వంతెన

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుకభాగంలో నిమ్మగడ్డి కంపెనీ సమీపంలోని కాలువపై ఏర్పాటు చేసిన ఇనుప వంతెన పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ప్రకృతి సోయగాలకు నిదర్శనంగా నిలిచే ఈ వంతెన సందర్శకులకు విశేషంగా నచ్చుతుంది. గత నాలుగేళ్ల క్రితం హీరో ఆది నటించిన ఆపరేషన్ గోల్డ్ ఫిష్ సినిమాకు సంబంధించి కొన్ని ముఖ్యమైన దృశ్యాలను ఈ వంతెనపై చిత్రీకరించారు. అప్పటినుండి ఈ వంతెన పర్యాటక ప్రాధాన్యం సంతరించుకుంది. సందర్శకులు ఇక్కడి

ఇనుప వంతెన

అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకోవడంలో మునిగిపోతున్నారు.
ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తే పర్యాటక అవసరాలకు తోడుగా సినిమాల చిత్రీకరణకు అనువైన ప్రదేశంగా మారే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం చొరవ చూపి పర్యాటక హబ్స్‌లో ఒకటిగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఏర్పాటు చేసిన ఇనుప వంతెన

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలీసుల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు : మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఆ పార్టీ భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఏపీ జెన్కో చెక్‌పోస్టు ప్రధాన రహదారి వద్ద వచ్చే పోయే వాహనాలను నిలిపివేసి తనిఖీ చేశారు. అనుమానితుల ఆధార్ కార్డు తదితర వివరాలను సేకరించి విడిచిపెట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో నడిచే నైట్ సర్వీసెస్ బస్సులను పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు నిలిపివేసిన సంగతి తెలిసిందే. రాజమండ్రి, డొంకరాయి రెండు బస్సులను సీలేరు ఎస్సై కే రవీంద్ర ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ ఎదురుగా నిలిపివేసి మరుసటి రోజు ఉదయం గమ్యానికి పంపించే విధంగా చర్యలు చేపట్టారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. మరోపక్క ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దుల్లో పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు పోలీసు వాహనాన్ని సోమవారం పేల్చివేసిన నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. సరిహద్దు ప్రాంతంలో సంచరించే అనుమానిక వ్యక్తులను ప్రశ్నించి విడిచి పెట్టారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. మావోయిస్టులకు సేఫ్టీ జోన్‌గా ఉన్న ప్రాంతాలను పోలీసుల ఆధీనంలోకి తీసుకొని అదనపు బలగంతో గాలింపు చర్యలు చేపట్టారు. మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా పగడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జగదాంబ

66 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) నందు డాక్టర్ జగదాంబ గైనకాలజిస్ట్ 66 మంది గర్భిణులకు మంగళవారం ఉచితంగా పరీక్షలు నిర్వహిచారు. పియంఎస్‌ఎంఎ) ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్‌లో భాగంగా పరీక్షలు చేశారు. గర్భిణులు ఉచితంగా సమగ్రంగా నాణ్యమైన, ప్రసవానంతర సంరక్షణనను అందించడానికి భారత ప్రభుత్వం ప్రతి నెల 9,10 తేదీల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేస్తారని డాక్టర్ పండా సతీష్ తెలిపారు. అవసరమైన వారికి స్కానింగ్, బ్లడ్‌టెస్టులు చేసి మందులు ఇస్తామని తెలిపారు. పౌష్టికాహారం ఎలా తీసుకోవాలి అనే అంశంపై అంగన్‌వాడీ, ఆశలకు రక్తహీనతతో ఉన్న గర్భిణులకు హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు కౌన్సిలింగ్ చేశారు. కార్యక్రమంలో హెడ్ సిస్టర్ దేవుడు నాగమణి, లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఏర్పడిందని ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ విశ్వమిత్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మోటార్లు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసినందున తరచూ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. వాటి స్థానంలో కొత్త మోటర్లు ఏర్పాటుకు స్థానిక ఎంపి, ఎమ్మెల్యే, ఐటీడీఎ సహకారంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అంతవరకు ఇబ్బంది లేకుండా అగ్నిమాపక శాఖ సహకారంతో నీటిని అందిస్తున్నామని వివరించారు. రెండు మూడు రోజుల్లో ఆసుపత్రికి పూర్తిస్థాయి నీటిని సరఫరా చేస్తామని, అంతవరకు రోగులు వారి కుటుంబీకులు సమస్యను అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ రోడ్డుకు బీటలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని చిన్నగడ్డ గ్రామ సచివాలయం సమీపంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు బీటలు బారింది. గ్రామస్థులు మాట్లాడుతూ, ఈ రోడ్డును మూడు ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టారని, నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతోనే బీటలు బారిందని తెలిపారు. భారీ వర్షాల సమయంలో రోడ్డుపై నీరు నిలిచి పోతుందని పేర్కొన్నారు. నాణ్యతతో పనులు జరిగి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులు తక్షణమే చేపట్టాలని గ్రామస్తులు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు.

బీటలు బారిన రోడ్డు

డుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

మన్యంలో వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిపింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా మోస్తరు వర్షం కురవగా సాయంత్రం వరకు చినుకులతో తేలికపాటి వర్షం కురిసింది. దీంతో, ఒక్కసారిగా వాతావరణం మారింది. అధిక ఉష్ణోగ్రతతో మండుతున్న ఎండలతో ఉక్కపోతకు గురవుతున్న గిరిజనులకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం కలిగింది.

అరకులోయ రూరల్: అరకులోయ మండల పరిసర ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. వాహనచోదకులు, పాదాచారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమాయమయ్యాయి.వరి నార్లు, కూరగాయల విత్తనాలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముంపు దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన సచివాలయం సిబ్బందికి వినతులు

ప్రజాశక్తి - కూనవరం: వర్షాలు ఎక్కువగా కురిస్తే ముంపు తప్పదని ముంపును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముంపు గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లోని సచివాలయ సిబ్బందికి మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. కూటూరు పంచాయతీలో సర్పంచ్ బొగ్గా వెంకమ్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటి సభ్యులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వరదల వల్ల మండలంలో పెద్దార్కూర్ పంచాయతీ, కూటూరు, అభిచర్ల, లింగాపురం, రేగులపాడు, చూచిరేవుల, కరకగూడెం పంచాయతీ పరిధి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. వరదల వల్ల విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా నిలిచిపోతోందని వాపోయారు. వీటితో పాటు అత్యవసర వైద్యసేవలకు వెళ్లాలన్నా చింతూరు, రాజమండ్రి, భద్రాచలం వెళ్లడానికి రహదారులు మొత్తం జలమయమై మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కోతులగుట్ట నుండి ఏడుగురాళ్లపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. సమస్యలపై 2022 నుండి ప్రభుత్వ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఐటిడిఎ పిఒకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని విమర్శించారు. కరకగూడెం పంచాయతీలోని గొమ్ముఅయ్యవారి గూడెం గ్రామానికి 40 అడుగుల ఎత్తు కాకుండా స్తంభాలు మరింత ఎత్తుగా నిర్మిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి ఆర్అండ్‌బి రోడ్డు మీదుగా బురదగూడెం రేగులపాడు

వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న ఆయా గ్రామస్తులు

వరకు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. బురదగూడెం నుండి తుమ్మల గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే చిన్నార్కూరు బస్టాండ్ నుంచి బొదునూరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. స్థానిక మేజర్ పంచాయితీ కూనవరం లో వరదల సమాచారం ఎప్పటికప్పుడు తెలిసే విధంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. లాంచీలు ముందుగా ఏర్పాటు చేయాలని తాళ్లూరి శ్రీనివాసరావు కోరారు. వరద సమస్యలు పరిష్కారం చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య,సర్పంచ్ వెంకమ్మ, ఎంపిటిసి అమ్మాజి, శాఖ కార్యదర్శి నూప రాజు, శేఖర్ శ్రీరాములు, పైదా వెంకయ్య,ప్రభాకర్ చిచ్చడి రాజయ్య ,దారయ్య కట్టం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ ప్రాంత నియామకాలకు చట్టం చేయాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డికి ఆదివాసీ జెఎసి వినతి

ప్రజాశక్తి - దేవీపట్నం : షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియమకాల చట్టం తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రకటించాలని రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్, టిఎసి కమిటి సభ్యులు సోళ్ల బొజ్జి రెడ్డికి వినతి పత్రం అందించామని ఆదివాసి జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. ఆయనతో పాటు దేవీపట్నం బిజెపి మండల అధ్యక్షులు కారం రామన్నదొర మాట్లాడుతూ 2025 జనరల్ డిఎస్సి నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయించి ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, ఎస్టి బాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, అన్ని ఐటిడిఎల ద్వారా ట్రైకార్ రుణాలు ఆదివాసీ యువతకు మంజూరు చేయాలని, రంపచోడవరం కేంద్రంగా కారం తమ్మనదొర పేరుతో ఆదివాసీ ప్రత్యేక జిల్లా ప్రకటించాలన్నారు. ముసిరిమల్లి ప్రాజెక్టు కాలువకు పూడిక తీసి సాగునీరు అందించాలని కోరారు. రంపచోడవరం కేంద్రంగా న్యాయకళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేవారం, ఇందుకూరు పంచాయతీల్లో ఉన్న చెరువులకు కొత్తతూములు, కళింగలు ఏర్పాటు చేయాలని, గోకవరం డిపో నుండి దేవారం వచ్చే బస్ వేళలు ఉదయం 8 గంటలకు సాయంత్రం ఐదు గంటలకు వచ్చే విధంగా మార్పు చేయాలన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలకు సోలార్ ఫెన్సింగ్ మంజూరు చేయాలని, చిన్నారి గండి ఆర్అండ్ఆర్ కాలనీ పెనికికలపాడు గ్రామానికి సురక్షిత మంచినీటి ఆర్వో ప్లాంట్ మంజూరు

సోళ్ల బొజ్జిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న తెల్లం శేఖర్, రామన్నదొర

చేయాలని కోరారు. అదేవిధంగా వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని, దేవారం, ఇందుకూరు, చొప్పకొండ, డిఎన్ పాలెం పంచాయతీల్లో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను తొలగించి కొత్త భవనాలను మంజూరు చేయాలన్నారు. ఏజెన్సీలోని అన్ని మండల కేంద్రాల్లో జీడిపిక్కల మినీ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై వినతులు అందజేశామన్నారు. సమస్యలపై ఎస్టి కమిషన్ చైర్మన్, టిఎసి కమిటి సభ్యులు చోళ్ల బొజ్జిరెడ్డి స్పందిస్తూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్ యలగాడ నాగేశ్వరరావు, బిజెపి జిల్లా కార్యదర్శి కుండ్ల కృష్ణారెడ్డి, సిహెచ్.తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండల కేంద్రంలోని విఆర్‌పురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నుంచి మొదటి సంవత్సరం బైపిసి, హెచ్ఇసి, సిఇసి గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న ఐద్వా మండల కార్యదర్శి రంగమ్మ

ఐద్వా మండల మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చింతూరు: అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) చింతూరు మండలం మహాసభ ఈ నెల 21వ తేదీన తుమ్మల్లో జరుగుతుందని దీనిని జయప్రదం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి ముర్రం రంగమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం చింతూరులో జరిగిన ఐద్వా ముఖ్య కార్యకర్తల సమావేశంలో రంగమ్మ మాట్లాడుతూ మహిళా సమస్యలపై, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ మహిళలను చైతన్య పరుస్తూ మహిళా లోకాన్ని ఐక్యం చేసేందుకు ఐద్వా నిరంతరం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని, ప్రతినెల మహిళలకు 1500 రూపాయలు ఇస్తామని చెప్పారని నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. పని ప్రదేశాల్లో మహిళా సాధికారత పేరుతో రాత్రిపూట మహిళలతో పని చేయించవచ్చని కూటమి ప్రభుత్వం క్యాబినెట్లో నిర్ణయం చేయడం దుర్మార్గమన్నారు. రానున్న రోజుల్లో మహిళల సమస్యలపై, మహిళా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించేందుకు ఈ నెల 21న మహాసభ నిర్వహించడం జరుగుతుందని మహిళలందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టా రాములమ్మ, శ్రీదేవి, సోడ్ రాములమ్మ, చిన్నమ్మ, ఎంపీటీసీ మొర్రం లక్ష్మి, బుచ్చమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఇఒలు

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని 98 పాఠశాలలకు, మొదటి విడతగా 17,401పాఠ్య పుస్తకాలను, 6 నుండి 10వ తరగతి వరకూ, అలాగే 28,644 నోట్‌బుక్స్ ఎంఇఒలు సత్యనారాయణదొర, సూరారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు మంగరాజు, విష్ణు, ఆది, సతీష్, శ్రీను, కార్యాలయ సిబ్బంది పలుపాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: రైతులు అధిక దిగుబడులు సాధించే విధంగా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి వ్యవసాయ అనుబంధ శాఖలు, పశు సంవర్ధకశాఖ, ఉద్యానవన శాఖ, సెరీకల్చర్, ఏపి ఎం ఐ పి, ఎన్ ఎం ఐ, డ్వామా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయానుబంధరంగా అధికారులు సంయుక్తంగా ఆర్గానిక్ వ్యవసాయానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటి వరకు రబీ, ఖరీఫ్ కాలంలో ఎన్ని ఎకరాలలో ఆర్గానిక్ సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి పెరుగుతున్న వ్యవసాయ పంటలను గుర్తించి ఆ దిశగా రైతులు సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జీవామృతం, ఘనామృతం వంటి ఆర్గానిక్ ఎరువులు ఎంత మేరకు అవసరం ఉంటుందో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రానున్న ఏడాదిలో రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని నిర్మూలించాలని చెప్పారు. ఖరీఫ్ లో రైతులకు సరఫరా చేయవలసిన విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. కాఫీ, మిరియాలు పంటకోత అనంతరం చేయవలసిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాఫీ రైతులకు అవసరమైన బేబీ పల్పర్లు, త్రిప్పర్లు, తార్పాలిన్లు, నిచ్చెనలు, కల్లాలపై ఆరా తీసారు. చింతపల్లి డివిజన్ లో మల్బరీ సాగును విస్తరించాలన్నారు. రీలింగ్ యూనిట్ నెలకొల్పడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఐటిడి ఏ పి ఓ కె. సింహాచలం, జిల్లా వ్యవసాయాధికారి ఎస్బి ఎస్ నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు, సెరీ కల్చర్ అధికారి అప్పారావు, డ్వామా పిడి విద్యాసాగర్, ఎపిఎం ఐపి పిడి ఎ.ఎ. రహీమ్, ఎన్ ఎం ఐడిఇ నాగేశ్వరరావు, ఎంపిడి ఓలు, ఎం ఒ ఓలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

అవార్డులు స్వీకరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో అనూప్ ఓకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంపిహెచ్‌డబ్ల్యూ కోర్స్ చదివి అత్యధిక మార్కులు సాధించిన శారంగి ప్రవర్ధినికి షైనింగ్ స్టార్ అవార్డు లభించింది. గిరిజన సంక్షేమ గురుకులం జూనియర్ కళాశాలలో సిఇసి గ్రూప్‌నకు చెందిన మువ్వల సతీష్‌కు అత్యధిక మార్కులతో సాధించినందుకుగాను ప్రిన్సిపాల పి.ఎస్.ఆర్.ఆంజనేయులు తోటి ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు. పాడేరులో సోమవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా వీరికి అవార్డు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న ప్రవర్ధినిని కళాశాల కరస్పాండెంట్ ఆశీర్వాదం తదితరులు అభినందించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

- ముగిసిన కిశోర వికాసంపై సమ్మర్ క్యాంపెయిన్

చింతపల్లిలో కిశోరవికాసంపై ర్యాలీ

దుంబ్రిగుడలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి: మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కిశోర్ వికాస కార్యక్రమాలపై సమీక్ష సదస్సు నిర్వహించారు. గత నెల 23 తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు సాగిన ఈ కార్యక్రమాల నిర్వహణపై ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి.వెంకటరమణి నేతృత్వంలో ఈ సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపిడీవో కోరాబు అనూష దేవి, తహశీల్దార్ టి.రామకృష్ణ, ఎంపిఈవో శ్రీనివాసరావు హాజరయ్యారు. బాల్యవివాహాలతో అనర్థాలు కలుగు తాయన్నారు. పోష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు విజయ కుమారి, గౌరీ, గౌహర్‌సుల్తానా, సత్యవతి అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: సమాజంలో బాలికలు ఉన్నత స్థాయిలో ఎదిగేలా ప్రజలందరూ ఎదుగుదలకు తోడ్పడాలని ఇన్చార్జి తహశీల్దార్ ముజీబ్, ఎంపిడిఓ ప్రేమ్ కుమార్ అన్నారు. ఐసిడిఎస్ సిడిపివో నీలిమ ఆధ్వర్యాన కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం జరిగింది. ఐసిడిఎస్ కార్యాలయంలో సమావేశం అనంతరం ర్యాలీ చేసి జాతీయ రహదారిలో మానవహారాన్ని చేపట్టి క్యొవ్వొత్తుల ప్రదర్శనతోపాటు బెలూన్లను ఎగుర వేశారు. అసమానతలు వదిలి బాలికల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. సూపర్వైజర్లు, అంగన్వాడీ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం దారకొండలో కిషోర్ వికాస్ కార్యక్రమంపై సర్పంచ్ ఎస్.రాజు ఆధ్వర్యంలో మంగళవారం పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలు వలన కలిగే నష్టాలు పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సర్పంచ్ రాజు మాట్లాడుతూ సమ్మర్ కిశోరీ వికాస్ కార్యక్రమాన్ని అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించామని పేర్కొన్నారు. లింగ వివక్ష విద్య, నైపుణ్యము ఆర్థిక అక్షరాస్యత పొదుపు, సైబర్ నేరాలు వలన కలిగే నష్టాలు, యోగా వలన కలిగే లాభాలు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు కిషోర్ వికాస్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తూ చిన్నతనంలో వివాహాలు చేసుకుంటే కలిగే నష్టాల గురించి పిల్లలకి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాడి రామన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు సచివాలయ సిబ్బంది కిషోర్ వికాస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : గంగవరం మండలం లక్కొండ గ్రామంలో మంగళవారం కిశోరి బాలికలకు బాల్య వివాహాలు, వాటి వల్ల సంభవించే ప్రమాదాల గురించి అవగాహన కల్పించినట్లు సిడిపిఓ లక్ష్మి తెలిపారు. కిశోరీ వికాసం వేసవి శిక్షణ 12వ రోజు కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తాయన్నారు. పుట్టే పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆమె తెలిపారు. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని వారికి ఆటపాటలతో పాటు విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం మహిళా సంరక్షణ కార్యదర్శి విజయ కుమారి డివిజన్ స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో మొదటి స్థానం కైవసం చేసుకున్న చెదల మౌనిక, లొల్లెడి లక్ష్మీప్రసన్న, కొండపల్లిలాస్యను సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్ కార్యదర్శి కారు చిన్నయ్య, సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

గంగవరంలో కిశోర వికాసంగా అవగాహన ర్యాలీ

అర్హులకు సేవలందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ ఏపిఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పై గిరిజనులకు అవగాహన కల్పించాలని ఐటిడిఎ ఏపిఒ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఐటిడిఎ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, గ్యాస్, పంచాయతీ రాజ్, బ్యాంకులు, ఎంపిడిఒలు, తహశీల్దారులు, ఐసిడిఎస్, జిసిసి, వ్యవసాయ శాఖ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో దర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు ఐటిడిఎ పరిధిలో 260 గ్రామాలు పథకం అమలు చేయడానికి ఎంపికయ్యాయన్నారు. ఈనెల 15 నుండి 30వ తేదీ వరకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, పిఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణాలు, వైద్య ఆరోగ్య సేవలు అందించాలని చెప్పారు. ప్రధాన మంత్రి జనమన్ పథకం కింద ఆర్థిక చేకూర్పు కల్పించాలని చెప్పారు. గ్యాస్ కనెక్షన్లు లేని లబ్ధిదారులను గుర్తించి పిఎం ఉజ్వల్ పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. ప్రతీ కుటుంబానికి బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలన్నారు. అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్న గ్రామాలలో ఉన్న అంతర్గత రహదారులు, విద్యుత్ సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు, పాఠశాలలు ఉన్నవి లేనివి పరిశీలించి అటువంటి మౌలిక వసతులు కల్పించి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి దర్తి ఆభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఎ జుగాను) విజయవంతంగా నిర్వహించి గిరిజనాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎంహెచ్ఒ టిఎన్ ప్రతాప్, ఎల్ఎం మాతు నాయుడు, గ్యాస్ మేనేజర్ ఎం.శ్రీనివాస కుమార్, పర్చువల్ గృహ నిర్మాణ శాఖ పిడి బి.బాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్. బిఎస్ నంద్, ఇంచార్జి ఐసిడిఎస్ పిడి ఝాన్సీ, డిపిఒ పిఎస్.కుమార్, పిఎంయు అధికారులు కె.రాజేష్, వి.లోహిత్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువతి మృతి

ప్రజాశక్తి-అనంతగిరి: మండల కేంద్రంలోని కూతవేటు దూరంలోని మంగళవారం ఉదయం ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. అది చూసిన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం అనంతగిరి పంచాయితీ మొండిజామిగూడ గ్రామానికి చెందిన జన్ని రాంబాబు, అదే పంచాయితీ లక్మిపురం గ్రామానికి నందుల. నీలమ్మ అనే యువతితో 8 నెలలో పాటుగా సహజీవనం చేస్తున్నాడు.మంగళవారం ఉదయం జామిగూడ గ్రామంలో ఇంటివద్ద నీలమ్మ అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఆ ఘటన చూసిన యువకుడు జన్ని రాంబాబు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధిత యువకుడికి అనంతగిరి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అరకు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు

పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళవారం గుర్తు తెలియని బాలుడిని పట్టుకున్నామని సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలివి.మధురవాడ లా కాలేజీ దగ్గర ఒకగుర్తుతెలియని బాలుడు తిరుగుతున్నాడని అందిన సమాచారం మేరకు సిబ్బంది పంపి అతనిని పోలీస్ స్టేషనుకు తెచ్చామన్నారు. వివరాలు అడిగితే, తన పేరు వాసుపల్లి చిట్టిబాబు అని, తన తల్లిపేరు జ్యోతి అని చెబుతున్నారు. ఇతర వివరాలు చెప్పలేకపోవడంతో బాలుడిని పోలీసు స్టేషన్‌లో తమ సంరక్షణలో ఉంచామన్నారు. బాబు వివరాలు తెలిసిన వారు పిఎం పాలెం పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు.

కంట్రోల్ రూం ఫోన్ నెంబర్లు

కార్పొరేట్ ఆఫీస్	: 1912
శ్రీకాకుళం	: 94906 12633
విజయనగరం	: 94906 10102
పార్వతీపురం మన్యం	: 83319 83217
విశాఖపట్నం	: 73822 99975
అనకాపల్లి	:94906 10022
అల్లూరి జిల్లా	: 94906 10027
రాజమహేంద్రవరం	: 73822 99960
కాకినాడ	:94931 78718
అంబేడ్కర్ కోనసీమ	:94409 04477
ఏలూరు	:94409 02926
పశ్చిమ గోదావరి	9490610152.

విద్యుత్ సమస్యలపై కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి- సీతమ్మధార : భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ సీఎండీ ఇమ్మడి అధికారులను అప్రమత్తం చేసారు. సిఎండి ఆదేశాలతో వినియోగదారులకు 24×7 సేవలందించేందుకు కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని 11 జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఎండి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా వినియోగదారులకు సేవలందించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూపరెంటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఆదేశించారు. అధికారులందరూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని సూపరెంటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలిచ్చారు. విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని వినియోగదారులు కంట్రోల్ రూమ్ నెంబర్లకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

సోలార్ సిస్టమ్‌ణు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ డిఇఇ గాబ్రియల్

సోలార్ విద్యుత్ పనితీరు పరిశీలన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పిఎం జన్‌మన్ పథకంలో భాగంగా కొండరెడ్డి గిరిజన కుటుంబాలకు కల్పించిన సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని విద్యుత్‌శాఖ డిఇఇ గాబ్రియేలు మంగళవారం పరిశీలించారు. పిఎం జన్‌మన్ పథకంలో భాగంగా మండలంలో 58 గిరిజన కొండరెడ్డి కుటుంబాలకు ఒక్కొ క్కరికి రూ.70 వేల వ్యయంతో సోలార్ సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. సోలార్ పథకం పనితీరును పరిశీలించేందుకు కొమరాపురం గ్రామానికి నాలుగు కిలోమీటర్లు అటవీ ప్రాంతాన్ని చేరి పొలాల్లో నివసిస్తున్న కోసూరి రాజయ్యమ్మ, కోసూరి పార్వతమ్మ, కోసూరి బాబూరావు నివాస ప్రాంతాల్లో సోలార్ సౌకర్యాన్ని డిఇఇ గాబ్రియేలు, ఎడి దివాకర్ ఎఇ కె. అబ్బాయిదొర, ఇంజనీర్ శ్రీనివాస్ పరిశీలించారు. సోలార్ పథకం చాలా ఉపయోగకరంగా ఉందని గిరిజనులు తెలిపారు. జూనియర్ ఇంజనీర్ పోలేశ్వరరావు, కాకినాడ సోలార్ సిస్టమ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్‌మెన్ రాజేష్, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్స్ రాఘవరెడ్డి, శ్రీనివాస్‌దొర, ప్రకాష్, మాజీ సర్పంచ్ కోసూరి బాబురావు పాల్గొన్నారు. అనంతరం డిఇఇ రాజవొమ్మంగి 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేశారు.

డాక్టర్ వాణిని అభినందిస్తున్న దృశ్యం

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి అభినందన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఇసుకపల్లి వాణికి మంగళవారం పలువురు అభినందనలు తెలిపారు. సిజిహెచ్ఎస్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎ.ఎస్ రామం, అబిద్ హుస్సేన్, బిజెపి వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపకుల రవికుమార్, నగర మెడికల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, కోకన్వీనర్ బి.భాగ్యలక్ష్మి, చొక్కాకుల రాంబాబు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కెజిహెచ్ అభివద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఎవిఎన్ కాలేజీ విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఎవిఎన్ కళాశాల ఇంటర్ (హెచ్ఇసి) విద్యార్థిని షేక్ రహీమున్నీసాకు షైనింగ్‌స్టార్ అవార్డు లభించింది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఎవిఎన్ కళాశాలలో ఆర్ట్స్ చదువుతున్న విద్యార్థిని అత్యధిక మార్కులు సాధించడం ఓ రికార్డు అని అక్కడివారు చెబుతున్నారు. పాతికేళ్ల తర్వాత ఈ కళాశాల నుంచి ఆర్ట్స్ అత్యధిక మార్కులు సాధించిన షేక్ రహీమున్నీసా ఎపి ప్రభుత్వం నుంచి అవార్డుకు అర్హత సాధించడం విశేషం. రాష్ట్ర,జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన అవార్డును, సర్టిఫికెట్‌ను కళాశాల కరస్పాండెంట్ ఎ.విఅదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు ఆమెకు అందజేశారు.కళాశాల అధ్యాపక బందం షేక్ రహీమున్నీసాను అభినందించారు.

విశాఖలో మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్

బాధితుల నుంచి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్య,ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్రలో తన రెండోరోజు పర్యటనలో భాగంగా మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయా వినతులపై అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు నెలవారీ జీతం చెల్లించడంతో పాటు ఇంటర్ జోనల్ బదిలీలకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

ఇటీవల తన భర్త మృతి చెందారని, ముగ్గురు పిల్లలు తనను అనాథలా వదిలేశారని, వద్ధాప్య పింఛన్ అందించి ఆదుకోవాలని విశాఖకు చెందిన అవ్వా కాంతం విన్నవించారు. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తన భర్త మృతి చెందారని, తమ కుటుంబానికి చెందవలసిన ఆస్తిని అత్త, మామ,మరిది అన్యాయంగా కాజేశారని నగరానికి చెందిన రెడ్లదిన్నె శ్రావణి ఆవేదనతో ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు 2020లో విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు వైసిపికి చెందిన కె.కెరాజు పర్యటన అడ్డుకుని నానా బీభత్సం సష్టించారని, పోలీసులు తూతుమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపు కున్నారని తాటిచెట్లపాలెంనకు చెందిన కె.గోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి గతంలో కేటాయించిన రెండున్నర ఎకరాల స్థలంలోనే శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో తమకు పసుపు-కుంకుమ కింద ఇచ్చిన 1.09 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమి తమకు వంశపారపర్యంగా వచ్చిందని,అయితే 2022లో జరిగిన రీసర్వేలో ఎఫ్ఎమ్ బీలో సదరు భూమి సబ్ డివిజన్‌ను తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని విశాఖ శాతవాహననగర్‌కు చెందిన వై.వసంత లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ లంకలపాలెంలోని కోనేరు అభివద్ధి పనుల్లో రూ.1.20 కోట్ల నిధుల గోల్ మాల్ జరిగిందని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 79 వ వార్డు కార్పోరేటర్ రౌతు శ్రీనివాస ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

వినతులు తీసుకుంటున్న మంత్రి నారా లోకేష్

ఆర్య వైశ్యులు చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనాలి

రాష్ట్రమంత్రి టి.జి భరత్

మాట్లాడుతున్న మంత్రి టి.జి.భరత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్యవైశ్యులు మరింత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ అన్నారు. మంగళవారం విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి భరత్‌ను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పేదవారికి సహాయపడటంలో ఆర్యవైశ్యుల పాత్ర ఎన్నదగినదన్నారు. అంతకుముందు ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు కుమార్‌శర్మ, ఆలయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు స్వాగతం పలికారు. అనంతరం కన్యకాపరమేశ్వరి దేవాలయ సంఘ అధ్యక్షుడు పెనుగొండ కామరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి భరత్ మాట్లాడారు. కార్యక్రమంలో నగరంలో ఆర్యవైశ్యుల ప్రముఖులు కంకటాల మల్లిక్,పైడా కష్ణ ప్రసాద్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు నేతి శ్రీనివాస్, కట్టమూరి సూర్యనారాయణ, కోశాధికారి దుర్గా నూకేశ్వరరావు, వాసవి కళ్యాణ మండప సంఘ అధ్యక్ష కార్యదర్శులు విన్నకోట రామమూర్తి పాల్గొన్నారు.

నేడు ఎపిడబ్ల్యూజెఎఫ్ డిమాండ్స్ డే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ డిమాండ్స్‌డే పాటిస్తోందని ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ప్రత్యేక అతిథిగా హాజరవుతారన్నారు.

దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేవాదాయ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 34 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామ మోహనరావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 9 మంది విశాఖ నగరానికి చెందినవారు కాగా, సింహాచలం దేవస్థానానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారు. బదిలీ అయినవారిలో సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బి.రాంబాబు, అసిస్టెంట్ ఇంజనీర్ డివిఎస్ రామరాజు, సూపరింటెండెంట్ పి.సునీల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ బి.అనురాధ, సీనియర్ అసిస్టెంట్ బి.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ ఎన్.కార్తీక్‌నాగ్, జూనియర్ అసిస్టెంట్ బాలభాస్కరసాయి ఉండగా, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ ఎన్.శ్రీను, టి.రేవతి దేవి ఉన్నారు. వీరిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. మిగిలిన వారు అరసవిల్లి దేవస్థానం, విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కు ముగ్గురు సింహాచలం నుంచి, నగరంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి బదిలీ అయ్యారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్ట్ ఏరియాలోని వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఎగ్జిక్యూట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో తెప్పోత్సవం నేత్ర పరంగా జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ సాధిక్ పాల్గొన్నారు.

ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి మహిళా నాయకులు

మహిళా రక్షణలో ప్రభుత్వం విఫలం

వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, మాజీ మేయర్ గొలగాని వెంకట హరికుమారి, రాష్ట్ర కార్యదర్శి ఈర్లె అనూరాధ అన్నారు. మంగళవారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద వీరి ఆధ్వర్యంలో మహిళలు సేవ్ ఉమెన్,సేవ్ ఆంధ్ర ప్రదేశ్ అని నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మహిళలు,బాలికలకు భద్రత కరువైందని ఆరోపించారు. తమ పార్టీ నాయకులపై కక్షలతో అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. పోలీసులు శాంతిభద్రతలను మంటగలుగుతున్నారని ఆరోపించారు. మహిళలకు భద్రత కల్పించడంలో విఫలమైన మహిళ హోం మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ,పల్లా చినతల్లి,పప్పుల సునీత,బి. పద్మావతి, రీసు అనురాధ, బొర్రా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి మహిళా నేతలు

మహిళలంటే చులకన భావం వీడాలి

టిడిపి మహిళా నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు ఆంధ్రుల రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ మంగళవారం టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా టిడిపి కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. మహిళలను కించపరుస్తూ చేసిన వాక్యాలను ప్రసారం చేసిన సాక్షి మీడియాను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గనగళ్ల సత్య,దవల విజయ కుమారి,అవ్వ కాంతం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి పండగ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గంగమ్మతల్లి పండుగను ఫిషింగ్ హార్బర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదాల పంపిణీ కౌంటర్ ప్రారంభించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మరపడవల సంఘం అధ్యక్షులు ఎం. లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్. నర్సింగరావు, కార్యదర్శి మున్నం బాలాజీ పాల్గొన్నారు.